ప్రజాశక్తి
ఆదివారం 9 నవంబర్ 2025
5
అల్లూరి సీతారామరాజు



తాగునీటి పథకం ప్రారంభం

ప్రజాశక్తి-చింతపల్లి : మండలంలోని బెన్నవరం పంచాయతీ పరిధి బొర్రమామిడి గ్రామంలో తాగునీటి పథకాన్ని ఏపి టూరిజం డైరెక్టర్ కిల్లు వెంకట రమేష్ నాయుడు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో శుద్ధమైన తాగునీరు అందించడం ప్రభుత్వ, ప్రజా ప్రతినిధుల ప్రధాన కర్తవ్యమని తెలిపారు. సర్పంచ్ బచ్చల సన్యాసమ్మ మాట్లాడుతూ గ్రామ ప్రజల సమస్యలను గుర్తించి ఈ ట్యాంక్ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పూజారి నారాయణమూర్తి, డిప్పల రాజు, జర్ర రాజేంద్ర, ముప్పల సత్తిబాబు, రాంబాబు, పూజారి నాగేశ్వరరావు, భాస్కర్, బూడిద సూకరాజు, ఉల్లి రమణ, మరి సాంబశివ, వంతల రాజుబాబు, శోభనం సూకరాజు పాల్గొన్నారు.


ప్రారంభిస్తున్న డైరెక్టర్

కాఫీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

-సిఐటియు జిల్లా అధ్యక్షులు చిన్నయ్యపడాల్
- మూడో రోజూ కొనసాగిన సమ్మె


పాడేరులో సమ్మె చేపడుతున్న కాఫీ కార్మికులు

ప్రజాశక్తి-చింతపల్లి : కాఫీ కార్మికుల సమ్మె నేపథ్యంలో ఈనెల 10న చింతపల్లి డివిజనల్ ఆఫీసులో యాజమాన్యంతో చర్చలు జరగనున్నాయని, ఆ చర్చల్లో కాఫీ కార్మికుల సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ విజ్ఞప్తి చేశారు. కొమ్మంగి ఎస్టేట్ గంధం వీధి గ్రామంలో కాఫీ కార్మికులతో శనివారం ఆయన మాట్లాడుతూ యాజమాన్యం ఇచ్చిన చర్చల నోటీసును చూపిస్తూ, ఈ చర్చలు సానుకూల దృక్పథంతో జరగాలని కోరారు. సంస్థ రక్షణతో పాటు కార్మికుల ప్రయోజనం కోసం కాఫీ కార్మిక సంఘం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. చర్చలు కేవలం సిఐటియు కాఫీ కార్మిక సంఘంతోనే జరగాలని, మరే ఇతర సంఘంతో కలిపి చర్చలు జరిపితే సమ్మె కొనసాగిస్తామని హెచ్చరించారు. డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాఫీ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మోరి వెంకటగిరి, కాఫీ కార్మికులు సిదరి రంభ, కంఠ కుమారి, సిదరి సన్యాసిరావు, వంతల రామారావు, సిదరి సాయి, మర్రి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


పెదబయలులో...

పెదబయలు : కాఫీ కార్మికుల సమ్మె మూడో రోజు శనివారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా చుట్టుమెట్ట ఎస్టేట్ వద్ద కాఫీ కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కాఫీ కార్మిక సంఘం (సిఐటియు) జిల్లా గౌరవ అధ్యక్షులు లింగేరి సుందరరావు మాట్లాడుతూ ప్రధానంగా సంస్థను కాపాడుకోనే ప్రయత్నంలో భాగంగానే సమ్మె చేస్తున్నామన్నారు. 2024 నవంబర్లో జరిగిన ఒప్పందాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా గత అక్టోబర్ నుంచి పెరిగిన విడిఏ పాయింట్లు ప్రకారం రోజువారి కూలి రేట్లు, పండ్లు సేకరణ రేట్లు పెంచాలని కోరారు. కార్యక్రమంలో హెల్పర్స్ సుందర్ కుమార్, రామారావు, సిద్దేశ్వరరావు, నాగరాజు, బుల్లెట్, మాధవరావు, సోనియా, రాధమ్మ, సుందరి, నిర్మల, కుమారి, కార్మికులు పాల్గొన్నారు.

పాడేరు: తమ డిమాండ్ల పరిష్కారం కోసం కాఫీ కార్మికులు చేపట్టిన సమ్మె శనివారం మూడవ రోజు కొనసాగింది ఈ సందర్భంగా మండలంలోని మినుములూరు ఏపీ ఎఫ్డిసి ఎస్టేట్ ముందు కాఫీ కార్మికులు తమ ఆందోళన కొనసాగించారు. దినసరి కూలి రేట్లు పెంచాలని కాఫీ పళ్ళ సేకరణ, కూలీ రేటు పెంచాలని కాఫీ కార్మిక సంఘం హెల్పర్స్, కార్మికులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కాఫీ కార్మికుల సంఘం గౌరవ అధ్యక్షుడు ఎల్ సుందరరావు మాట్లాడుతూ ఏపీ ఎఫ్డిసిలో పోస్టుల ఖాళీలను భర్తీ చేయాలని సంస్థ యాజమాన్యాన్ని కోరారు. కనీసం క్షేత్రస్థాయిలో ఉన్నటువంటి పోస్టులైన ప్లాంటేషన్ కండక్టర్స్ ఖాళీలను ను కూడా నియమించకపోవడంతో ప్రస్తుతం పని చేస్తున్న హెల్పర్స్ పై పని భారం పెరిగిందన్నారు. అంతే కాకుండా 90 మంది ఉండవలసిన ప్లాంటేషన్ కండక్టర్స్ కేవలం హెల్పర్స్ తో 18 మందితో మాత్రమే సుమారుగా 3 వేల హెక్టార్ష లలో క్షేత్రస్థాయి పనులు జరిపిస్తున్నారని ఆరోపించారు. గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. కాఫీ కార్మికుల సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామ్నారు. ఈ కార్యక్రమంలో హెల్పర్స్ కాంతమ్మ, సత్యనారాయణ, రాంబాబు, దేవి, వరలక్ష్మి, మంగమ్మ, లక్ష్మి, చిన్నలమ్మ కార్మికులు పాల్గొన్నారు.

అరకులోయరూరల్: అరకువేలి సుంకరమెట్ట పంచాయతీ దాబుగూడ, అనంతగిరి నుండి సుంకరమెట్ట వరకు ఉన్న ఆంధ్రప్రదేశ్ ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ సంస్థ కాఫీ తోటల్లో పని చేసే కార్మికులను కనీస వేతనం ఇవ్వాలని కాఫీ రైతుల సంఘం జాతీయ నాయకులు గెమ్మెలి చినబాబు డిమాండ్ చేశారు. శనివారం సుంకర మెట్ట పంచాయతీలో ఫారెస్ట్ కాఫీ తోట కార్మికులు 25 మందితో నూతన కమిటీ ఏర్పాటు చేసుకున్నారు. అధ్యక్షులుగా గెమ్మెలి జ్యోతి, కార్యదర్శిగా బి విజయలక్ష్మి, ఉపాధ్యక్షులుగా బి లక్ష్మి, సన్యాసిరావు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కాఫీ రైతుల సంఘం జాతీయ నాయకులు గెమ్మెలి చిన్నబాబు మాట్లాడారు. అనంతగిరి నుండి సుంకర మెట్ట పరిధిలో ఉన్న ఆంధ్రప్రదేశ్ ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ సంస్థ కాఫీ తోటల్లో పని చేయడానికి స్థానికులకే పని కల్పించాలన్నారు. కార్మికులకు కనీస వేతనం రోజుకు రూ.400 ఇవ్వాలని, ఈపిఎఫ్,ఐఎస్ ఇన్సూరెన్సు సదుపాయం కల్పించాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని తెలిపారు. కాఫీ కార్మికులు సంఘటితం అవ్వాలని, అప్పుడే ప్రభుత్వం ముందుకు వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాఫీ కార్మికులు పాల్గొన్నారు.


అరకులోయలో నినాదాలు చేస్తున్న కాఫీ కార్మికులు, నాయకులు


చింతపల్లిలో నోటీసును చూపుతున్న చిన్నయ్యపడాల్

హైడ్రో పవర్ ప్రాజెక్టుల పేరుతో..

గిరిజనుల భూములు ధారాదత్తం

- తక్షణమే జిఒలు రద్దు చేయాలి - గ్రామసభలో తీర్మానం


మాట్లాడుతున్న సర్పంచ్

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: హైడ్రో పవర్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా అరకులోయ మండలం బస్కి పంచాయితీ కొర్రగూడ రెవెన్యూ గ్రామంలో స్థానిక సర్పంచ్ పాడి రమేష్ ఆధ్వర్యంలో శనివారం పేసా గ్రామసభ నిర్వహించారు. హైడ్రో పవర్ ప్రాజెక్ట్ రద్దు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం నవయుగ,ఆదాని కంపెనీలతో చేసుకున్న ఒప్పందాల 2, 13,51 జిఓలు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఏకగ్రీవంగా పేసా కమిటీ, గ్రామ పెద్దలు తీర్మానించారు. ఈ సందర్భంగా పేసా కమిటీ సభ్యులు మాట్లాడుతూ, హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణం రద్దు చేయాలని లేనిపక్షంలో భవిష్యత్తులో భారీ ఎత్తున పోరాటం చేయవలసిన పరిస్థితి వస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి గిరిజనుల ప్రాణాలంటే లెక్క లేకుండా ఇష్టా రాజ్యాంగా అదానీ, నవయుగ కంపెనీలకు తమ భూములు దారాదత్తం చేస్తామంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారులు స్పందించి హైడ్రో పవర్ ప్రాజెక్ట్ అనుమతులు జీవోలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కిల్లో రామన్న, హైడ్రో పవర్ ప్రాజెక్ట్ వ్యతిరేక పోరాట కన్వీనర్ బురిడీ దశరద్ సిపిఎం అరకులోయ మండల కార్యదర్శి కిండంగి రామారావు, పేసా కమిటీ సభ్యులు రవి, దేవన్న, మాజీ సర్పంచ్ కామరాజు, వార్డ్ మెంబర్ లు కొండలరావు, మోస్య, ఐదు గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


గ్రామసభకు హాజరైన గిరిజనులు


శంకుస్థాపన చేస్తున్న జెడ్‌టిసి గంగరాజు

డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి అనంతగిరి: మండలంలోని ఎగువశోభ పంచాయతీ పరిధి బీసుపురం, పొర్నపోధర్ గ్రామాలకు జిల్లా పరిషత్ నిధులతో చేపట్టే అబివృద్ధి పనులకు స్థానిక జెడ్పిటిసి. గంగరాజు ఆధ్వర్యంలో శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గంగరాజు మాట్లాడుతూ, డ్రైనేజీలు నిర్మించేందుకుగాను బీసుపురంకు రూ. 5 లక్షలు, పొర్నపొధర్‌కు 5 లక్షల నిధులు కేటాయించడం జరిగిందని ఆయన తెలిపారు. ఇప్పటికే అనేక గ్రామాలలో చెక్ డామ్, సీసి రోడ్లు, డ్రైనేజీ వంటి పనులు చేపట్టామని తెలిపారు. మరిన్ని గ్రామాలను గుర్తించి నిధుల కేటాయించడానికి కృషి చేస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కొర్రా. సింహాద్రి, సిపిఎం నాయకులు జి .దేవన్న, ఎస్. నాగులు, వార్డు సభ్యులు ఎస్. మధు, ఎస్. అనిల్, గ్రామస్తులు రాములమ్మ, దాసు, సన్యాసి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గంజాయితో జీవితాలు నాశనం

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం స్థానిక పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గంజాయితో కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది మాట్లాడుతూ చదువుకున్న యువత గంజాయి సేవించి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకుని తల్లిదండ్రుల పేరును నిలబెట్టాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ ఈగల్ టీం, ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపక సిబ్బంది, కళాశాల విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న పోలీస్ ఈగల్ టీం సభ్యులు

'మధ్యాహ్న' కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్
ఘనంగా మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా ప్రథమ మహాసభ

ప్రజాశక్తి - రంపచోడవరం : మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించకపోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా కార్యాలయంలో మధ్యాహ్న భోజన యూనియన్ జిల్లా మొదటి మహాసభ కె.శాంతిరాజు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ముందుగా మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు వరలక్ష్మి సిఐటియు జెండా ఆవిష్కరించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న కార్మికుల సమస్యలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నెలలు గడుస్తున్నా వారికి రావాల్సిన వేతనాలు, వంట బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంవల్ల మధ్యాహ్న భోజన కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కిరాణా షాపుల వద్ద అప్పులు తీసుకుంటూ కుటుంబాలను నెట్టుకు రావాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మధ్యాహ్న కార్మికుల పట్ల నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తున్నాయని విమర్శించారు. తక్షణమే వారి సమస్యలు పరిష్కరించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న వేతనాలు వంట బిల్లులు విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. వంట చేసే సమయంలో ప్రమాదవశాత్తూ ఏదైనా జరిగినట్ల యితే వారికి కనీసం భీమా సౌకర్యం కూడా లేదన్నారు. కార్మికులందరికీ ఇన్సూరెన్స్, పిఎఫ్ ఇఎస్ఐ వంటి సౌకర్యాలను ప్రభుత్వం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. 25 మందితో నూతన జిల్లా కమిటిని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా పుష్ప, ఎం.రామలక్ష్మి, కోశాధికారిగా యు.వరలక్ష్మిని జిల్లా ఉపాధ్యక్షులుగా ఈఎం.భద్రమ్మ, కె.అమ్మాజీ, జిల్లా సహాయ కార్యదర్శులుగా వీరమణి, గంగాయమ్మను యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులుగా కె.శాంతిరాజుని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ రాంబాబు, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఈతపల్లి సిరిమల్లెరెడ్డి, గిరిజన సంఘం జిల్లా నాయకులు తీగల శ్రీనివాస్ మధ్యాహ్న భోజన కార్మికులు తదితరులు పాల్గొన్నారు.


పతాకావిష్కరణ కార్యక్రమంలో యూనియన్ నాయకులు

పిహెచ్‌సి లేబర్ రూమ్, వాష్‌రూమ్ పునరుద్ధరణ

ప్రజాశక్తి- మోతుగూడెం: చింతూరు మండలం మోతుగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో లేబర్ రూమ్, వాష్‌రూమ్ పునరుద్ధరించారు. గిరిజన ప్రాంతాల్లో మెరుగైన ఆరోగ్య సేవలను అందించాలనే సంకల్పంతో, సమారిటన్స్ ఫర్ ది నేషన్ సంస్థ ప్రాజెక్ట్ వీటిని పునరుద్ధరించారు. దీని ద్వారా ప్రసూతి సేవల కోసం మరింత సురక్షితమైన, పరిశుభ్రమైన వాతావరణం ఏర్పడింది. కార్యక్రమంలో భాగంగా, ప్రసూతి సేవలకు అవసరమైన పరికరాలు నూతన శిశసంరక్షణ పరికరాల సముదాయం పిహెచ్‌సికి అందజేశారు. దీని ద్వారా తల్లులు, శిశువులకు సురక్షితమైన, సమర్ధమైన సేవలు అందించడానికి వీలు కలిగింది. పునరుద్ధరించిన లేబర్ రూమ్, వాష్‌రూమ్‌లను శనివారం సంస్థ వ్యవస్థాపకుడు రామ్‌కుమార్ ఇతర వాలంటరీ సంస్థల ప్రతినిధుల సమక్షంలో డిప్యూటి డిఎంహెచ్ఒ డాక్టర్ పి. పుల్లయ్య పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ అభిఘ్న వైద్య సిబ్బంది సమక్షంలో ప్రారంభించారు. సేవా కార్యక్రమానికి సంస్థ దాతలు హాజరయ్యారు. మొత్తం 3.2 లక్షల వ్యయంతో అమలైన ఈ ప్రాజెక్ట్, గిరిజన ప్రాంతాల్లో తల్లి శిశు ఆరోగ్యసేవలను మెరుగుపర చడంలో ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది. త్వరలోనే మోతుగుడెం పిహెచ్‌సిలో ప్రసూతి సేవలు ప్రారంభం కానున్నాయి

నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలి

ఐద్వా ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి - ఎటపాక: పెరుగుతున్న గ్యాస్, నిత్యావసర ధరలు తగ్గించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో గన్నవరంలో శనివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఐద్వా మండల కార్యదర్శి పొడియం రత్తమ్మ మాట్లాడుతూ రోజురోజుకీ నిత్యావసర ధరలు పెరిగిపోతున్నాయని, ధరలు నియంత్రించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయన్నారు. జిఎస్‌టి తగ్గించి ప్రజలకు మేలు చేశామని ప్రభుత్వం చెప్తున్నప్పటికీ సామాన్యుడికి మాత్రం ఊరట లభించలేదన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గిస్తే, ప్రతి నిత్యావసర సరుకుల ధరలు తగ్గుతాయని, అప్పుడే సామాన్యుడికి ఊరట లభిస్తుందన్నారు. మహిళ ఖాతాలో నెలకు రూ.1500 జమ చేస్తామన్న ప్రభుత్వం తమ వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో కారం జయమ్మ, విజయకుమారి, కారందుర్గ, సుశీల, పసుపులేటి రాధ, అలివేలు మంగ, మౌనిక తదితరులు పాల్గొన్నారు.


ఆందోళన నిర్వహిస్తున్న మహిళలు

రేపాకను 41వ కాంటూరులో చేర్చాలి

సిపిఎం మండల కార్యదర్శి బాబు బొర్రయ్య

ప్రజాశక్తి-కూనవరం: మండలంలోని రేపాక గ్రామంలో సమావేశం జెట్టి మారయ్య అధ్యక్షతన జరిగింది. సిపిఎం మండల కార్యదర్శి బాబు బొర్రయ్య మాట్లాడుతూ రేపాక గ్రామాన్ని 41వ కాంటూరుకు చేర్చి భూమి ప్యాకేజీ ఆర్ అండ్ ఆర్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2022లో ప్రభుత్వం పోలవరం ముంపునకు గురయ్యే గ్రామాలను లైడార్ సర్వేల ద్వారా గుర్తించినప్పుడు రేపాక గ్రామంలో ఊరి మధ్యలో రైడర్ సర్వే సంబంధించిన ప్లస్ గుర్తు స్టాగును వేశారు. కానీ ఆ గ్రామాన్ని 41. కాంటురులో చేర్చకపోవడం ఏమిటని ప్రశ్నించారు. సచివాలయంలోని సర్వేయర్ల సిబ్బందితో సర్వే చేయించడమే కాకుండా డ్రోన్ కెమెరాలతో సర్వే కూడా చేశారు. ఇదే విషయమై కలెక్టర్‌ని కలిసి ఈ విషయం గురించి గ్రామస్తులందరు ఐటిడిఎలో కలిశారు. ఈ విషయాన్ని కలెక్టర్ కి విన్నవించినప్పుడు కలెక్టర్ కూడా ఈ గ్రామాన్ని ఎందుకు చేర్చలేదు ఇరిగేషన్ డిపార్ట్మెంట్ వారికి పంపించి విచారణ చేస్తామని హామీ ఇచ్చారు. రైడర్ సర్వే పేరుతో ముంపు బాధితులను తప్పుడు తడకల లెక్కలు చూపి నిర్వాసితులను గందరగోళం చేస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యురాలు స్థానిక సర్పంచ్ మడకం నాగమణి మాజీ సర్పంచ్ మడకం బుజ్జి మడకం సత్యనారాయణ వార్డ్ మెంబర్ మడకం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిపిఎం మండల కార్యదర్శి బాబు బొర్రయ్య

వివాహ వేడుకలకు సంప్రదాయ చేనేత వస్త్రాలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: వివాహాది వేడుకలవేళ భారతీయత ఉట్టిపడే సంప్రదాయత నిండిన వేలాదిరకాల పట్టు, నేత చీరలనేషనల్ సిల్క్ ఎక్స్‌పో, ఎగ్జిబిషన్ కమ్ సేల్ వస్త్ర ప్రదర్శన హోటల్ గ్రీన్‌పార్కులో ప్రారంభమైంది. ఈ నెల 11 వ తేదీ వరకూ నిర్వహిస్తున్న ప్రదర్శనలో షాపింగ్ చేయటం గొప్ప అనుభూతిని కలిగిస్తుందని నిర్వాహకులు తెలిపారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుండి సేకరించిన మగ్గాల ఉత్పత్తులు అన్నింటిని ఒకచోట ఈ ప్రదర్శనలో అందుబాటులో ఉంచామన్నారు. ఈ ప్రదర్శనలో వేలాదిరకాల పట్టు, కాటన్ డిజైన్ దుస్తులు, డిజైనర్ చీరలు, బ్లౌజ్‌లు, కుర్తీలు మొదలైనవి 50 శాతం వరకు తగ్గింపుతో ఒకేచోట అందుబాటులో ఉంచామని తెలిపారు. ఈ ప్రదర్శన ప్రతిరోజు ఉదయం 11నుండి రాత్రి 9 వరకు ఉంటుందని,ప్రవేశం ఉచితం అన్నారు.

'రేడియాలజీపై అవగాహన పెరగాలి'

ప్రజాశక్తి- విశాఖకలెక్టరేట్: రేడియాలజీ పట్ల ప్రజల్లో అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని, రాష్ట్ర రేడియాలజిస్టుల సంఘం అధ్యక్షులు డాక్టర్ సురేష్ అన్నారు. అంతర్జాతీయ రేడియాలజీ దినోత్సవం సందర్భంగా శనివారం కెజిహెచ్‌లో రేడియాలజిస్టులు, రేడియోగ్రాఫర్లు ఉత్సాహంగా పాల్గొని ఎక్స్‌రే ఆవిష్కర్త డాక్టర్ రాంట్‌జెన్‌కి నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి మాట్లాడుతూ, కెజిహెచ్ లో మంచి సేవలు అందిస్తున్నారని ఇంకా మెరుగైన సేవల కోసం ప్రయత్నం చేయాలన్నారు. రేడియాలజీ విభాగాధిపతి డాక్టర్ బుజ్జిబాబు రేడియాలజీ ప్రాముఖ్యతను వివరించారు.

'తారురోడ్డుకు నిధులు మంజూరు చేయండి'

ప్రజాశక్తి-కూనవరం: గండికొత్తగూడెం గ్రామానికి తారురోడ్డు మంజూరు చెయ్యాలని సర్పంచ్ నాగమణి డిమాండ్ చేసారు. తొండ లక్ష్మయ్య అద్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ గండి కొత్తగూడెం గ్రామానికి రోడ్డు నిర్మించాలని పలుమార్లు ఐటిడిఎ అధికారులకు కలెక్టర్లకు, స్థానిక ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు ఇచ్చినా ఉన్నత అధికారాలు స్పందించడం లేదన్నారు. గండి కొత్తగూడెం గ్రామానికి రోడ్డు మంజూరు చేయాలని లేదంటే ఉద్యమాన్ని ఉదృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో మండల కార్యదర్శి బాబు బొర్రయ్య, మండల కమిటి సభ్యులు తెల్లం తమ్మయ్య, సీనియర్ నాయకులు ఉయక కన్నయ్య సభ్యులు పాల్గొన్నారు

తెరుచుకోని పాఠశాలలు

ఉపాధ్యాయులు విధులకు డుమ్మా
ప్రభుత్వ ఆదేశాలు బేఖాతరు



దారకొండ యుపి పాఠశాల గేటు మూసేసి ఉన్న దృశ్యం

ప్రజాశక్తి -సీలేరు: విద్యాశాఖ అధికారి ఆదేశాలను బేకాతర్ చేస్తూ ఉపాధ్యాయులు విధులకు డుమ్మ కొట్టి మైదాన ప్రాంతానికి తరలిపోయారు. జీకే వీధి మండలం ధారకొండ ప్రభుత్వ అప్పర్ ప్రైమరీ స్కూల్ , గుమ్మరేవులు ఎంపిపి పాఠశాల, శనివారం మూసివేశారు. ఇటీవల మొంథా తుఫాను ప్రభావం వలన ప్రభుత్వం మూడు రోజులు పాఠశాలకు సెలవు ప్రకటించింది సంగతి తెలిసిందే. అందువలన రెండో శనివారం పాఠశాలలకు సెలవు లేదని యధాతథంగా పాఠశాలలు తెరవాలని విద్యాశాఖ అధికారులు ఆదేశించారు. అయితే వారి ఆదేశాలు తమకు వర్తించవు అన్నట్టుగా ఉపాధ్యాయులు వ్యవహరించి పాఠశాలకి తాళాలు వేసి దర్జాగా సొంత గ్రామాలకు వెళ్లిపోయారు. పిల్లలకు పాటలు బోధించకుండా ఉపాధ్యాయులు వెళ్లిపోవడమేమిటని విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారిపై కఠినచర్యలు తీసుకోవాలన్నారు.

సెలవు ఇచ్చినట్టు వెల్లడైతే చర్యలు

ఈ విషయమై ప్రజాశక్తి జికెవీధి ఎంఇఒ 2 మాడి రామన్నకు వివరణ కోరగా విధులకు ఉపాధ్యాయులు డుమ్మా కొట్టినట్టు తమ విచారణలో వెల్లడైతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.



నినాదాలు చేస్తున్న గిరిజనులు

రోడ్డు మరమ్మతు చేపట్టాలి

- సిపిఎం ఆధ్వర్యంలో గిరిజనుల నిరసన

ప్రజాశక్తి- అరకులోయ రూరల్: మండలంలోని మాడగడ పంచాయతీ దానిరంగిని జంక్షన్ నుండి బస్కి పంచాయితీ భరెంగిబంధ గ్రామం వరకు తారు రోడ్డు మరమ్మతులు చేపట్టాలని శనివారం సిపిఎం ఆధ్వర్యంలో గ్రామస్తులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కిండంగి రామారావు మాట్లాడుతూ, దానిరంగిని జంక్షన్ నుండి బరెంగిబంద తారు రోడ్డు పూర్తిగా ధ్వంసమై మరమ్మతులకు గురైందన్నారు. దీంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని పేర్కొన్నారు. ఈ రోడ్డు గుండా అరకువేలి, అనంతగిరి, హుకుంపేట మండలానికి చెందిన కొర్రాగుడ, కంజరితోట, బిజ్జగూడ కొంత్రాయిగూడ, తుంబవలస, బూర్జ, మజ్జివలస, వేంగడా అనేక గ్రామాలకు చెందిన ప్రజలు నిత్యం వేలాదిమంది ప్రయాణం సాగిస్తుంటారన్నారు. అనారోగ్యం పాలైతే సకాలంలో వైద్యం కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు చేరుకోలేకపోతున్నారన్నారు. రోడ్డు మరమ్మతులకు గురై ప్రమాదాలు చోటు చేసుకుం టున్నాయని తెలిపారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు తక్షణమే చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పేసా కమిటీ సభ్యులు కె.దేవన్న, కె రవి, ఎంపిటిసి కె రామన్న, కె లక్ష్మన్, చిన్నంనాయుడు, సుబ్బారావు, వార్డు సభ్యులు భగవాన్, మొస్య, రాంబాబు పాల్గొన్నారు.



గెడ్డలో చేపడుతున్న పనులు

శ్రమదానంతో కల్వర్టు పనులు

ప్రజాశక్తి -అనంతగిరి: గత వారం రోజుల క్రితం మండలంలోని కురిసిన మొంథా తుఫాను కారణంగా కివర్ల పంచాయతీ బుడ్డిగరువు గ్రామాం వద్ద గెడ్డ పై తాత్కాలిక కల్వర్టు కొట్టుకు పోయింది. గ్రామానికి చెందిన గిరిజనులు నిత్యం ఆ మార్గం గుండా రాకపోకలు సాగిస్తారు.రోడ్డు మార్గం దెబ్బతినడంతో మాజీ ఎంపీటీసీ నూకరాజు ఆధ్వర్యంలో గ్రామస్తులు శనివారం శ్రమధానంతో్ట మట్టిని పూడ్చారు. గ్రామానికి చెందిన 60 కుటుంబాలు పైగా పంచాయతీ కేంద్రం లేదా అనారోగ్యాలకు గురైనప్పుడు ఆసుపత్రులకు వెళ్లాలనా, మండల కేంద్రంలో నిత్యావసర సరుకులు తెచ్చుకునేందుకు నిత్యం ఈ మార్గం గుండానే రాకపోకలు సాగిస్తున్నామన్నారు.ఈ విషయంపై అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికి స్పందించక పోవడంతో శ్రమాధానతంతో పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు బాసు, రాము, సూరిబాబు, శ్రీను, రాములమ్మ. తదితరులు పాల్గొన్నారు .

సమస్యలు పరిష్కరించాలని..

కాగడాలతో ఆదివాసీల నిరసన



కాగడాలతో నిరసన చేపడుతున్న గిరిజనులు


ప్రజాశక్తి -అనంతగిరి:కొండ శిఖరు దబ్బలపాడు గ్రామంలో దీర్ఘకాలికంగా నెలకొన్న సమస్యలు తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆదివాసి గిరిజనులు కాగడాలతో శనివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ, గ్రామం ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా నేటికీ రోడ్డు, కరెంటు, తాగునీటి, గృహాలు వంటి మౌలిక వసతులు కల్పించడంలో అప్పటి, నేటి రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అయ్యాయన్నారు. దీంతో ఆ గ్రామానికి చెందిన 10 కుటుంబాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. గ్రామానికి కనీస మట్టి రోడ్డు సౌకర్యం లేక ఆ గ్రామానికి చెందిన గిరిజనులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.. గర్భిణీ, బాలింతలు అనారోగ్యానికి గురైతే వారికి సకాలంలో వైద్య సేవలు కోసం తరలించాలంటే ఎత్తైన కొండ కోనల నడుమ కిలోమీటర్ల దూరం విజయనగరం జిల్లాలో మెంటడ ఆసుపత్రికి తరలించవలసిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి పలుమార్లు విన్నవించినా పట్టించుకున్న దాఖలు లేవని గ్రామస్తులు వాపోతున్నారు. రాత్రులు ఇళ్లల్లో భోజనాలు చేయాలంటే కొవ్వొత్తులు వెలిగించుకొని చేయవలసిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు.దట్టమైన అటవీ ప్రాంతం, ఎత్తైన కొండలు ఉండడంతో రాత్రుల సమయంలో గ్రామం వద్ద విషపూరితమైన జంతువులు ప్రవేశిస్తున్నడంతో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నామన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం తక్షణమే విద్యుత్ సౌకర్యం కల్పించాలని గిరిజనులు కోరుతున్నారు.

జన్‌మన్ హౌసింగ్ లబ్ధిదారులకు..

పెంచిన రూ.లక్ష తక్షణమే చెల్లించాలి

ఎపి ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలదేవ్

ప్రజాశక్తి-చింతపల్లి : పిఎం జన్‌మన్ హౌసింగ్ పథకం కింద పివిటిజి గ్రామాల్లో ఇళ్లు నిర్మించిన లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన అదనపు లక్ష రూపాయలు తక్షణమే చెల్లించాలని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ డిమాండ్ చేశారు. ఈ పథకం కింద చేపట్టాల్సిన 11 రకాల అభివృద్ధి కార్యక్రమాలు పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరారు. ఈనెల 10న అన్ని మండల కేంద్రాల్లో నిర్వహించనున్న ధర్నాలను విజయవంతం చేయాలని గిరిజనులకు పిలుపునిచ్చారు. చింతపల్లి గిరిజన ఉద్యోగుల భవనంలో సంఘం చింతపల్లి, జికె.వీధి మండలాల సంయుక్త సమావేశం కొర్రా బాలయ్య అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సందర్భంగా బాలదేవ్ మాట్లాడుతూ పీఎం జన్‌మన్ పథకంలో భాగంగా పివిటిజి కుటుంబాలకు ఇళ్ల నిర్మాణానికి రూ.2.39 లక్షల యూనిట్ ధరతో మంజూరు చేసినప్పటికీ, పెరిగిన నిర్మాణ సామగ్రి ధరలకు ఆ మొత్తం సరిపోవడం లేదని తెలిపారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం అదనంగా లక్ష రూపాయలు ఇవ్వాలని జీవో జారీ చేసినా, ఇప్పటివరకు లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు జమ కాలేదని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా పివిటిజి గ్రామాల్లో చేయాల్సిన అనుసంధాన రహదారులు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ స్తంభాలు, సామాజిక భవనాలు, చెక్ డ్యాంలు, అంగన్వాడీ భవనాలు, పోడు భూమి పట్టాలు వంటి అభివృద్ధి పనులు ఏ గ్రామంలోనూ పూర్తి కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వీటి అమలుకు తక్షణ చర్యలు తీసుకోకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.ధర్మన్న పడాల్, మండల కార్యదర్శులు సాగిన చిరంజీవి, ముర్ల చంటిబాబు, నాయకులు సింహాచలం, రాంబాబు, దావిదు, లక్ష్మయ్య, రామచంద్ర, మహేష్, కృష్ణ, రమేష్, జగన్, కేశవరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎపి ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలదేవ్

నేరాలు ఘోరాలు

కొబ్బరి చెట్టు నుండి పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం పొట్టిదొరపాలెం గ్రామంలో శనివారం కొబ్బరి చెట్టు మీద నుండి ప్రమాదవశాత్తు జారిపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. వడ్డాది రెల్లివీధికి చెందిన ముత్యాలు శ్రీను వడ్డాది సెంటర్లో కొబ్బరి కాయలు అమ్ముకుని జీవనం సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో పొట్టిదొరపాలెంలో కొబ్బరి బొండాలు దించడానికి శ్రీను చెట్టు ఎక్కాడు. ప్రమావశాత్తు జారి కింద పడిపోయాడు. దీంతో స్థానికులు వైద్యం నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యలోనే మృతి చెందాడు. శ్రీనుకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చోడవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు బుచ్చయ్యపేట ఎస్సై శ్రీనివాసరావు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని సబ్బవరం మేజర్ పంచాయతీ పరిధి సాయినగర్ కాలనీలో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... సాయినగర్ కాలనీకి చెందిన పితాన స్వాతి (29) బ్యూటిషన్‌గా పని చేస్తున్నారు. మ్యారేజ్, మెచ్యూర్ ఫంక్షన్‌లకు మేకప్‌లు వేసేవారు. ఆమె భర్త చిరంజీవి మధురవాడలో ఓ గ్యాస్ ఏజెన్సీలో పనిచేస్తున్నాడు. వీరి మధ్య కొంత కాలంగా తరచూ గొడవలు జరుగుతున్నాయి. శుక్రవారం రాత్రి భర్త చిరంజీవి, స్వాతి ఇద్దరు వేర్వేరుగా రెండు గదుల్లో పడుకున్నారు. చిరంజీవి శనివారం ఉదయం స్వాతి పడుకున్న గది తలుపు కొట్టగా ఆమె ఎంతకీ తలుపు తీయకపోవడంతో తలుపు విరగ్గొట్టి లోపలకు వెళ్లే సరికి స్వాతి ఉరివేసుకొని మృతి చెంది ఉంది. దీంతో వెంటనే చిరంజీవి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి సిఐ జి.రామచంద్రరావు సిబ్బందితో చేరుకొని విచారణ చేశారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించారు. మృతురాలు తల్లి యర్ర వెంకటలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతురాలికి వెంకట కార్తీక్ (13) మోక్షిత్ (7) కుమారులు ఉన్నారు.

10 కేజీల గంజాయితో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-గొలుగొండ:10 కేజీల గంజాయితో నిందితుడిని అరెస్టు చేయడం జరిగిందని గొలుగొండ ఎస్సై పీ.రామారావు తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు శనివారం మండలంలోని చిన్నయ్యపాలెం గ్రామ శివారులో కృష్ణదేవిపేట నుండి వస్తున్న ద్విచక్ర వాహనాన్ని మాటు వేసి పట్టుకున్నామన్నారు. ఆ వ్యక్తి వద్ద ఈ గంజాయిని స్వాదీనం చేసుకున్నామని తెలిపారు.



మాట్లాడుతున్న నాయకులు

ఎల్‌టిఆర్ కేసులు నమోదు చేయాలి

ప్రజాశక్తి-హుకుంపేట:మండల కేంద్రంలో గిరిజనేతరుల అక్రమ నిర్మాణాలు రోజురోజుకు విపరీతంగా పెరుగుతున్నాయని, వాటిని అడ్డుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారని ఆదివాసి గిరిజన సంఘం మండల కమిటీ తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేసింది. సంఘ కార్యదర్శి టి.కృష్ణారావు, నాయకులు వి.లక్ష్మణరావు, ఎస్.హైమావతి మాట్లాడుతూ, గిరిజనేతరులు చేపడుతున్న అక్రమ నిర్మాణాలపై అనేకసార్లు రెవెన్యూ, పంచాయతీ అధికారులకు పిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. 1/70 చట్టం ఆదివాసుల భూములకు రక్షణ కవచమని, దాన్ని ఉల్లంఘించే వారిపై ఎల్టీఆర్ కేసులు నమోదు చేయకపోతే ఉద్యమం తప్పదని హెచ్చరించారు. షేక్ వహీద్ నిర్మిస్తున్న అక్రమ నిర్మాణంపై అధికారులు ఎందుకు తాత్సారం చేస్తున్నారో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు.ఈ నిర్మాణాన్ని నిలిపివేయాలని, లేకపోతే ఆందోళన చేపడుతుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డి.కృష్ణమూర్తి, పి.లింగమూర్తి, కె.అప్పారావు పాల్గొన్నారు.

రాజు మృతి తీరని లోటు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: సిపిఐ సభ్యుడు, విశాఖపట్నం విశాలాంధ్ర బుక్‌హౌస్ మేనేజర్ పోలవరపు అప్పలరాజు (పి.ఎ.రాజు) సంస్మరణ సభ శనివారం విశాఖ లక్ష్మిటాకీస్ దరి ఆంగ్లో ఇండియన్ కల్యాణ మండపంలో జరిగింది. సిపిఐ జాతీయసమితి సభ్యుడు జె.విసత్యనారాయణమూర్తి పాల్గొని మాట్లాడుతూ, చిన్న వయస్సుకుడైన రాజు మృతి పార్టీకి, విశాలాంధ్ర బుక్‌హౌస్‌కు తీరని నష్టమని నివాళు లు అర్పిస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు ఎం.పైడిరాజు నాయకులు ఎస్.మురళి, వై.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కెజిహెచ్‌లో రూ.40 కోట్లతో అతిపెద్ద ఒపి బ్లాక్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఉత్తరాంధ్ర ఆరోగ్య ప్రదాయినిగా పేరుగాంచిన కెజిహెచ్‌లో రూ.40 కోట్లతో అతిపెద్ద ఒపి బ్లాక్‌ను త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ తెలిపారు. శనివారం కెజిహెచ్‌కు వచ్చి అక్కడి తాజా పరిస్థితిలను సంబంధిత అధికారులను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ కెజిహెచ్‌లో రెండేళ్లతో పోలిస్తే ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. దీంతో కెజిహెచ్‌లో ఎక్కడ, ఏం జరుగుతుందో ఇట్టే తెలుస్తోందన్నారు. మందులు ఇచ్చే ప్రాంతంలో రోగులు కూర్చోవడానికి వీలుగా ఏర్పాట్లు చేశామన్నారు. మైకులు పెట్టామన్నారు. 14 ఆర్ఒ ప్లాంట్‌లను ఏర్పాటు చేశామన్నారు. 13 వెంటిలేటర్లను రప్పించామన్నారు. రూ.5,6 కోట్లతో గుండెకు సంబంధించిన పరికరాలను త్వరలో ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అలాగే ప్రతి బ్లాకులో ఎసి సదుపాయం కల్పించామని చెప్పారు. కెజిహెచ్ రూపురేఖలు మారుస్తున్నామని తెలిపారు. ఆసుపత్రిపై జరుగుతున్న తప్పుడు ప్రచారాలను ఎవరూ నమ్మొద్దన్నారు.

పనుల్లో పొరపాటు వల్లే విద్యుత్ అంతరాయం

పనుల్లో పొరపాటు వల్లే ఇటీవల కెజిహెచ్‌లో విద్యుత్ అంతరాయం ఏర్పడిందని, ఇది యాజమాన్యం, ప్రభుత్వ వైఫల్యం కాదని వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. క్రిటికల్ కేర్ వద్ద వాటర్ పైపులైన్ల పనులు చేస్తుండగా జెసిబి బకెట్ తగిలి దిగువన ఉన్న విద్యుత్ కేబుల్ లైన్లు తెగిపోయాయని తెలిపారు. దీని వల్ల మధ్యాహ్నం రెండు గంటల నుంచి కొన్ని విభాగాలలో విద్యుత్ సరఫరా నిలిచిందన్నారు. అదే సమయంలో దేవి అనే మహిళ సీరియస్ కండిషన్లో ఆసుపత్రిలో చేరిందని, ఆమె అనారోగ్యంతో మృతి చెందిందే తప్ప, విద్యుత్తు లేనందున మృతి చెందలేదని తెలిపారు. వాస్తవాలు తెలుసుకోకుండా వైసిపి నాయకులు నోటికి వచ్చినట్లు ప్రకటనలు ఇస్తున్నారని ధ్వజమెత్తారు.

ఉచితన్యాయ సహాయంపై అవగాహన అవసరం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: న్యాయసేవాధికార చట్టం 1987పై అర్హత కలిగిన వారికి అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజు అన్నారు.శనివారం జిల్లా న్యాయసేవా సంస్థ ఆధ్వర్యంలో న్యాయసేవా వారోత్సవాల్లో భాగంగా న్యాయఅవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు (వార్షిక ఆదాయం రూ.3 లక్షలు లేదా అంతకంటే తక్కువ), మహిళలు, పిల్లలు, షెడ్యూల్డ్ కులాలు,తెగలు, వికలాంగులు మొదలైనవారికి ఉచిత చట్టపరమైన సలహా, న్యాయ సహాయం, కోర్టు ఫీజులు ఉచితంగా అందుతాయని తెలిపారు. ఈ పథకాలు లోక్ అదాలత్ ద్వారా వివాదాలు పరిష్కరించడం, పారాలీగల్ వాలంటీర్లతో సహా చట్టపరమైన అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, మధ్యవర్తిత్వం (మీడియేషన్) ద్వారా కేసులు ఎలా పరిష్కరించుకోవాలో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి ఎం.వెంకట రమణ,ఫ్యామిలీ కోర్టు జడ్జి కె.రాధారత్నం,బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.కె.శ్రీనివాస్ పాల్గొన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు చీరల పంపిణీ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: సత్యసాయి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మురళినగర్ శ్రీసత్యసేవా సమితి భజన మండలి ఆధ్వర్యంలో, శనివారం కెజిహెచ్ గైనిక్‌వార్డు నందు 65 మంది గర్భిణులకు చీర, గాజులు, పసుపు, కుంకుమ, స్వీట్లు ఇచ్చి సత్కరించారు. కార్యక్రమం శ్రీ సత్యసేవాసమితి భజన మండలి సభ్యులు ఇందిర, ఎస్.నాగమణి, ఉమాదేవి, శారద అధ్యర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో కెజిహెచ్. గైనిక్ విభాగాధిపతి డాక్టర్ జి.సౌమిని, డాక్టర్ శైలజతో పాటు ఇతరవైద్యులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి మాట్లాడారు.

ఆశా వర్కర్లు భవిష్యత్ పోరాటాలకు సిద్ధం కావాలి

ఉత్సాహంగా యూనియన్ జిల్లా రెండో మహాసభ

ప్రజాశక్తి- రంపచోడవరం : ఆశవర్కర్స్ భవిష్యత్ పోరాటాలకు సిద్ధం కావాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ పిలుపునిచ్చారు. శనివారం ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ రంపచోడవరం జిల్లా రెండో మహాసభ జిల్లా అధ్యక్షులు రవ్వ.వీరమ్మ అధ్యక్షతన ఉత్సాహభరితంగా జరిగింది. మహాసభకి ముఖ్య అతిథిగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడేళ్ల కాలంగా రంపచోడవరం 11 మండలాల పరిధిలో ఆశ వర్కర్ల సమస్యలపై, ఏజెన్సీలో ఆశ వర్కర్లు పడుతున్న ఇబ్బందుల్ని ఎదుర్కొంటూ మిలిటెంట్ పోరాటాలు చేశారని దాని కారణంగానే ప్రసూతి సెలవులు, వయో పరిమితి, గ్రాట్యుటీ, జిఒ నంబర్ 94ని సాధించుకున్నారని తెలిపారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఆశా కార్మికులతో వెట్టి చాకిరీ చేయించుకుంటున్నారే తప్ప, కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయకుండా, ప్రమాదవశాత్తు ఏదైనా జరిగితే కనీసం ప్రమాద బీమా సౌకర్యం కూడా కల్పించడం లేదని, ఆశ వర్కర్లపై పని భారం బాగా పెరిగి అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. ఖాళీ పోస్టులు ప్రభుత్వం భర్తీ చేయకుండా రెండు మూడు గ్రామాలకి ఒకే ఆశ వర్కర్‌తో పనిచేయించడం వల్ల పని ఒత్తిడిని తట్టుకోలేక దేవరాతి గూడెం గ్రామం, నర్సాపురం పిహెచ్సి గర్భిణి కారం నాగమణి గత రెండు నెలల క్రితం చనిపోయిందని, ఆమె మరణానికి వైద్యాధికారులు, ఐటిడిఎ అధికారులే కారణమని ఆరోపించారు. నాగమణి కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని సిఐటియుగా ఆయన డిమాండ్ చేశారు. పలు సమస్యల పరిష్కారానికి రాబోయే మూడేళ్లలో రెండో జిల్లా మహాసభలో నూతన కమిటీల ద్వారా అనేక పోరాటాలకి రూపకల్పన చేయటం జరుగుతుందని వారి పోరాటాలకి సిఐటియు జిల్లా కమిటీ పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. అనంతరం నూతన జిల్లా కమిటీని ఏర్పాటు చేశారు. జిల్లా అధ్యక్షురాలుగా రవ్వ వీరమ్మ, జిల్లా ప్రధాన కార్యదర్శిగా మట్ల వాణిశ్రీ, కోశాధికారిగా సారపు మంగయమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 15 మందితో కార్యదర్శ వర్గం, 35 మందితో నూతన జిల్లా కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని పల్లపు వెంకట్ తెలిపారు. అనంతరం భవిష్యత్తు పోరాటాలకి రంపచోడవరం 11 మండలాల ఆశ వర్కర్లు అందరూ సిద్ధం కావాలని, ఈ నెల 16,17 తేదీల్లో రంపచోడవరంలో జరిగే సిఐటియు రెండో జిల్లా మహాసభలను ఆశ వర్కర్లు అందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. డిసెంబర్ - 31 నుంచి జనవరి - 4, 2026 విశాఖ నగరంలో జరిగేటటువంటి సిఐటియు జాతీయ మహాసభలను విజయవంతం చేసే దానికి ఆశ వర్కర్లందరూ సహకరించాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రాంబాబు మరో ఉపాధ్యక్షులు పుట్టా రామరాజు, 11 మండలాల ఆశ వర్కర్ల మండల కమిటీ లీడర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ఎన్నికైన నూతన జిల్లా కమిటీ సభ్యులు

రోడ్ల పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: నగరంలో చేపడుతున్న రోడ్ల అభివద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. సాగరమాల ప్రాజెక్టులో భాగంగా కాన్వెంట్ జంక్షన్ నుంచి పోర్టుడాక్ ఏరియా వరకూ చేపడుతున్న రోడ్డు పనులను జివిఎంసి, ఎన్.హెచ్. విభాగాల అధికారులతో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. పార్టెనర్షిప్ సమ్మిట్ నాటికి అన్ని పనులను పూర్తి చేయాలని, నాణ్యత విషయంలో రాజీ పడొద్దని సూచించారు. నిర్ణీత సమయానికి పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. జివిఎంసి సిఇ సత్యనారాయణరాజు, ఎస్ఇ జాతీయ రహదారుల విభాగం అధికారులు ఉన్నారు.

విశాఖపట్నం-నౌపడ- పర్లాకిమిడి సెక్షన్ తనిఖీ

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ: వాల్తేరు డివిజనల్ రైల్వే మేనేజర్ (డీఆర్ఎం) లలిత్ బోహ్రా శనివారం విశాఖపట్నం-నౌపడ- పర్లాకిమిడి రైల్వేసెక్షన్‌లో విస్తృతతనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రయాణీకులకు కల్పిస్తున్న సౌకర్యాలు స్టేషన్లలో మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులను సమీక్షించారు. ప్లాట్‌ఫారమ్‌ల ఎత్తు పెంచడం, మెరుగైన విద్యుద్దీకరణ, తాగునీటి సదుపాయాలను మెరుగుపరచడం, ప్లాట్‌ఫారమ్ షెల్టర్లు, దివ్యాంగుల ప్రయాణీకులకు అందుబాటు చర్యలు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు ఇతర ముఖ్యమైన మెరుగుదల పనుల పురోగతిని అంచనా వేశారు. పర్లాకిమిడి, దూసి, విజయనగరం వంటి ముఖ్య స్టేషన్లలో అభివద్ధి పనులు, సర్క్యులేటింగ్ ప్రాంతాల మెరుగుదల, శుభ్రత, సుందరీకరణ ,నిర్వహణ ప్రమాణాలను ఆయన పరిశీలించారు. పర్లాకిమిడి స్టేషన్‌లో సమస్యలపై ప్రత్యేకదృష్టి సారించారు. సీనియర్ డివిజనల్ ఇంజనీర్ (తూర్పు) సాయిరాజ్, సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్ అవినాష్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ పవన్‌కుమార్, సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ మూర్తి పాల్గొన్నారు.

సమస్యల వలయంలో సప్పర్ల ఆశ్రమ పాఠశాల

ప్రహరీ లేక అవస్థలు

అడవిపందులు, అడవిదున్నలతో భయం..భయం..

డైనింగ్ హాల్‌లోనే విద్యార్థుల నిద్ర

ఉపాధ్యాయులకూ వసతి కరువు

మరమ్మతుకు గురైన బోరు

ప్రజాశక్తి -సీలేరు: పేరుకే ప్రభుత్వ ఆశ్రమ పాఠశాల అందుకు తగ్గ సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు. విద్యకే పెద్దపీట వేస్తున్నామని గొప్పలు చెప్పుతున్న ప్రభుత్వాలు ఆ దిశగా సదుపాయాలు కల్పించడంలో ఎటువంటి పురోగతి సాధించడం లేదు. ఇదీ సప్పర్ల ఆశ్రమ ఉన్నత బాలుర పాఠశాల దుస్థితి. వివరాల్లోకి వెళితే జీకే వీధి మండలం సప్పర్ల ఆశ్రమ పాఠశాలలో మూడో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులు ఇక్కడ చదువుతున్నారు. 210 మంది విద్యార్థులు ఉండగా వారికి పూర్తిస్థాయి వసతి సౌకర్యాలు లేక గత కొన్ని సంవత్సరాలుగా అనేక ఇబ్బందులు గురవుతున్నారు. ఉపాధ్యాయులకు విద్యార్థులకు పూర్తిస్థాయి వసతులు కల్పించే దిశగా అధికారులు దీర్ఘకాలికంగా చర్యలు చేపట్టకపోవడంతో పరిస్థితి దయనీయంగా మారింది. దట్టమైన అటవీ ప్రాంత సమీపంలో సప్పర్ల ఆశ్రమం పాఠశాల ఉంది. పాఠశాలకు చుట్టుపక్కల రక్షణ గోడ లేకపోవడంతో రాత్రి సమయంలో అడవిగేదెలు, అడవిపందులు పాఠశాల ఆవరణలోకి వస్తున్నాయి. ఎప్పుడు దాడి చేస్తాయో అని ఉపాధ్యాయులు విద్యార్థులు భయంతో వణుకుతున్నారు. విద్యార్థులుకు పూర్తిస్థాయి వసతి సౌకర్యాలు లేకపోవడంతో అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. భోజన సౌకర్యాలు కల్పిస్తున్న రెండు డైనింగ్ హాల్లో 210 మంది విద్యార్థులు రాత్రి సమయంలో బస చేస్తున్నారు.




పాఠశాల ప్రధాన భవనం

అభివద్ధికి నోచుకోని సప్పర్ల ఆశ్రమ పాఠశాల

సప్పర్ల ఆశ్రమ పాఠశాల ఏర్పాటు చేసి సంవత్సరాల గడుస్తున్నా నేటికీ అభివద్ధికి నోచుకోలేదు. గత ఏడాది పాఠశాల పూర్తిస్థాయి ఆధునీకరణకు గిరిజన సంక్షేమ శాఖ సర్వే చేసి 10 కోట్లు అంచనా బడ్జెట్ తయారు చేశారు. గత ఏడాది అక్టోబర్ 24 రాష్ట్రవ్యాప్తంగా గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు ప్రధానోపాధ్యాయులతో ట్రైబల్ వెల్ఫేర్ కమిషనర్ వర్క్ షాప్ నిర్వహించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సప్పర్ల ఆశ్రమ పాఠశాల హెచ్ఎం పాత్రుని నాగేశ్వరరావు వర్క్‌షాప్‌లో కమిషనర్ కు పాఠశాల అభివద్ధికి వేసిన పది కోట్లు అంచనా బడ్జెట్ నివేదికను అందజేశారు. గత కొన్ని నెలల క్రితం భావన నిర్మాణాలకు మూడు కోట్లు మంజూరు చేశారు. అయినప్పటికీ పనులు చేపట్టడానికి నేటికీ శ్రీకారం చుట్టలేదు .

మంచినీటి సమస్య

ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకి మంచినీటి సమస్య తీవ్రంగా వెంటాడుతుంది.



పాడైన బోరు

పూర్తిస్థాయి మంచినీటి సౌకర్యం లేక విద్యార్థులు వంట కుక్‌లు ఇబ్బందులు గురవుతున్నారు. పాఠశాలలో ఉన్న ఒక బోరు పూర్తిగా మరమ్మతుకు గురికాగా మరొక బోరు బావి నుంచి మోటార్ ద్వారా ట్యాంకుకి నీటిని సరఫరా చేసి దానిద్వారా కొంతమేరకు విద్యార్థులు వంటలకు త్రాగునీటికి వినియోగిస్తున్నారు.విద్యార్థులు కాలకృత్యాలు తీర్చుకోడానికి పాఠశాల సమీపంలో ఉన్న గెడ్డకు వెళ్లి వస్తుంటారు.

ఉపాధ్యాయులకు వసతుల కొరత

పాఠశాలలో ఉపాధ్యాయులు ఉండడానికి పూర్తిస్థాయి వసతులు కల్పించాలని కోరుతున్నారు. ఉపాధ్యాయులు ఉండడానికి భవనాలు లేక అరకొర భవనాల్లో కాలం వెళ్ళదీస్తున్నారు. ఒకానొక సమయంలో ఉపాధ్యాయులు రాత్రి సమయంలో క్లాస్‌రూమ్‌లోనే తలదాచుకోవాల్సిన పరిస్థితి నెలకొంటోంది. ౧ 210 మంది విద్యార్థులకు ఒకే వంట కుక్ ఉండడంతో హెచ్‌ఎం, వార్డెన్ అనేక ఇబ్బందులు గురవుతున్నారు. నిర్ణీత సమయానికి విద్యార్థులకు భోజన సౌకర్యాలు కల్పించడం కష్టతరంగా మారుతుందని ఆందోళన చెందుతున్నారు.